రాష్ట్రపతి అల్పాహార విందులో బీఆర్ఎస్ ఎంపీలు

హైదరాబాద్, మార్చి 21 (నమస్తేతెలంగాణ): బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్‌రావు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన అల్పాహార, తేనీటి విందుకు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయ సభల సభ్యులకు అల్పాహార విందు ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నది.

కంపెనీల్లో 50% కోడింగ్ ఏఐతోనే

- టెక్ కొలువులకు ఏఐ నైపుణ్యం కీలకం
- లేకుంటే ఉద్యోగాల్లో కొనసాగడం కష్టం
- కెరీర్‌పై విద్యార్థులకు ఆల్ట్‌మన్ హెచ్చరిక



న్యూఢిల్లీ: టెక్ ఉద్యోగాల్లో చేరేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగంలో ప్రావీణ్యం సాధించాలని 'చాట్ జీపీటీ' మాతృ సంస్థ 'ఓపెన్ ఏఐ' సీఈవో శామ్ ఆల్ట్‌మన్ కీలక సూచన చేశారు. ఇప్పటికే చాలా కంపెనీల్లో కోడింగ్ పనుల కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తున్నారని, ప్రస్తుతం అనేక కంపెనీల్లో 50%పైగా కోడింగ్ పనులను ఏఐ నిర్వహిస్తోందని ఆయన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. టెక్ ఉద్యోగాల్లో చేరాలనుకునే విద్యార్థులంతా ఏఐతో కలిసి పనిచేయడం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. లేకుంటే జాబ్ మార్కెట్‌లో నిలదొక్కుకోవడం కష్టమవుతుందని హెచ్చరించారు. ఏఐలో నైపుణ్యం సాధించిన వారికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. మానవ కోడర్ల స్థానంలో ఏఐని ప్రవేశపెట్టాలన్న ఆలోచన నానాటికీ విస్తృతమవుతోందని, దీనికి అనేక మంది పారిశ్రామికవేత్తలు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మరో 6 నెలల్లో 90 శాతం కోడింగ్ పనులను ఏఐ చేయగలదని, ఈ ఏడాది చివరి నాటికి కోడింగ్‌లో మానవులను ఏఐ పూర్తిగా అధిగమించగలదని 'ఆంత్రోపిక్' కంపెనీ సీఈవో అమోడీ వేసిన అంచనాలతో ఆల్ట్‌మన్ ఏకీభవించారు.

రోజుకు 5 వేలిస్తేనే కాపురం చేస్తా!

- *బెంగళూరులో భర్తను బెదిరించిన భార్య!*
- *భర్తే తనను వేధిస్తున్నాడని భార్య ఆరోపణ*

బెంగళూరు: రోజుకు రూ.5 వేలు ఇస్తేనే తనతో కాపురం చేస్తానని తన భార్య అంటోందని బెంగళూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నదని, తనను ఉద్యోగం చేసుకోనివ్వకుండా వేధిస్తున్నదని బాధితుడు వెల్లడించాడు. ఒక వేళ విడాకులు ఇవ్వాలనుకొంటే రూ.45 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నదని తెలిపాడు. పిల్లలను కనడానికి తన భార్య తిరస్కరిస్తున్నదని తెలిపారు. తాను ఇంటి నుంచి పని చేస్తున్నప్పుడు పెద్దగా సంగీతం పెట్టి నృత్యం చేయడంతో ఉద్యోగం పోయిందని వాపోయాడు. అయితే శ్రీనివాస్ ఆరోపణలను బిందు ఖండించారు. తాను విడాకుల కోసం డబ్బు డిమాండ్ చేయలేదని తన భర్తే తనను అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నాడని ఆమె ఆరోపించింది.

జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు!

- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నగదు దొరికినట్టు వార్తలు
- అంతర్గత విచారణకు హైకోర్టు సీజే ఆదేశం
- అలహాబాద్ హైకోర్టుకు న్యాయమూర్తి బదిలీ
- అభ్యంతరం తెలిపిన అక్కడి బార్ అసోసియేషన్
- ఇది చెత్త కుండీ కాదంటూ తీవ్ర వ్యాఖ్యలు
- బదిలీ, అంతర్గత విచారణ వేర్వేరన్న సుప్రీం కోర్టు
- జడ్జి ఇంట్లో ఎలాంటి నగదు లభించలేదని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 21: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో గుట్టల కొద్దీ నోట్ల కట్టలు దొరికాయన్న వార్తలు కలకలం రేపాయి. జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందికి మంటలు ఆర్పే సందర్భంగా భారీ స్థాయిలో కరెన్సీ కట్టలు కనిపించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని సీనియర్ న్యాయవాది ఒకరు ఢిల్లీ హైకోర్టులో ప్రస్తావించడంతో ప్రధాన న్యాయమూర్తి సైతం దిగ్భ్రాంతి చెందారు. సుప్రీంకోర్టు సైతం వేగంగా స్పందించింది. ఈ ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ప్రాథమిక విచారణను చేపట్టడం కొలీజియం తీసుకున్న చర్యలలో ఒకటని, ఈ ఉదంతంపై మరిన్ని చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. జస్టిస్ వర్మ బదిలీపై కొలీజియం సిఫార్సును కేంద్రం ఆమోదించవలసి ఉంటుంది. ఆ తర్వాతే బదిలీ ఉత్తర్వులు వెలువడతాయి.

ఇది చెత్తకుండీ కాదు

జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ప్రతిపాదించడాన్ని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ శుక్రవారం తీవ్రంగా వ్యతిరేకించింది. 'ఇది చెత్త కుండీ కాదు' అంటూ బార్ అసోసియేషన్ మండిపడింది. జస్టిస్ వర్మ బదిలీ వార్తలు వెలువడిన వెంటనే తమ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అనిల్ తివారీ అధ్యక్షతన సమావేశమైన బార్ అసోసియేషన్ జస్టిస్ వర్మ బదిలీని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. జస్టిస్ వర్మను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు పంపాలన్న కొలీజియం నిర్ణయం తమను దిగ్భ్రాంతికి గురిచేసిందని తివారీ ఓ ప్రకటనలో తెలిపారు. జస్టిస్ వర్మ నివాసం నుంచి లెక్కల్లో చూపని రూ. 15 కోట్లు దొరికినట్టు తమకు తెలిసిందని ఆయన పేర్కొన్నారు. కొలీజియం తీసుకున్న నిర్ణయంతో అలహాబాద్ హైకోర్టు చెత్త కుండీనా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

జస్టిస్ యశ్వంత్ వర్మ

ఢిల్లీ హైకోర్టు

అంతర్గత విచారణ, బదిలీ వేర్వేరు: సుప్రీం

అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీ స్థాయిలో నగదు బయటపడినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణ చేపట్టడం, జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడం వేర్వేరని సుప్రీంకోర్టు శుక్రవారం ప్రకటించింది. జస్టిస్ వర్మ నివాసంలో నగదు బయటపడినట్టు వచ్చిన ఆరోపణలకు సంబంధించి తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని సుప్రీంకోర్టు తెలియచేసింది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనకు, అంతర్గత విచారణ ప్రక్రియకు సంబంధం లేదని, అవి రెండూ వేర్వేరని సుప్రీంకోర్టు ఓ ప్రకటనలో తెలిపింది. తమకు సమాచారం అందిన వెంటనే ఢిల్లీ హైకోర్టు సీజే సాక్ష్యాలు, వివరాల సేకరణతో అంతర్గత విచారణను ప్రారంభించారని సుప్రీంకోర్టు పేర్కొంది. మార్చి 20న జరిగిన కొలీజియం సమావేశానికి ముందు అంతర్గత విచారణ ప్రారంభించిన ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ సీజేఐకి నేడే తన నివేదికను అందచేస్తారని ప్రకటన పేర్కొంది. నివేదికను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది.

ఎవరీ జస్టిస్ వర్మ?

జస్టిస్ యశ్వంత్ వర్మ 1992 ఆగస్టు 8న న్యాయవాదిగా తన పేరును నమోదు చేసుకున్నారు. 2014 అక్టోబర్ 13న ఆయన అలహాబాద్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016 ఫిబ్రవరి 1న ఆయన అలహాబాద్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణం చేశారు. 2021 అక్టోబర్ 11న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు.

నగదు లభించలేదు

ఫైర్ సర్వీసెస్ చీఫ్ ప్రకటన

జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో మంటలను ఆర్పే సమయంలో అగ్నిమాపక సిబ్బందికి నగదు ఏదీ కనిపించలేదని ఢిల్లీ అగ్నిమాపక సర్వీసుల అధిపతి అతుల్ గార్గ్ శుక్రవారం ప్రకటించారు. మార్చి 14న రాత్రి 11.35 గంటల ప్రాంతంలో జస్టిస్ వర్మ నివాసంలో మంటలు చెలరేగినట్టు కంట్రోల్ రూముకు ఫోన్ వచ్చిందని, వెంటనే రెండు అగ్నిమాపక శకటాలు అక్కడకు వెళ్లాయని గార్గ్ తెలిపారు. మంటలను ఆర్పిన తర్వాత పోలీసులకు తమ సిబ్బంది సమాచారం అందచేసి అక్కడి నుంచి వచ్చేశారని తెలిపారు. మంటలను ఆర్పే సమయంలో తమ సిబ్బందికి ఎటువంటి నగదు కనిపించలేదని ఆయన స్పష్టం చేశారు.

ఏప్రిల్ 1 నుంచి ఆ నంబర్లకు

యూపీఐ సేవలు బంద్

న్యూఢిల్లీ, మార్చి 21: క్రియారహిత మొబైల్ ఫోన్ నంబర్లపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ఆదేశాలు జారీచేసింది. ఇతరులకు కేటాయించిన, ఇన్‌యాక్టివ్ మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవలు నిలిపివేయాలని ఆదేశించింది. అనధికార వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఈ మేరకు పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, బ్యాంకులకు ఎన్‌పీసీఐ ఈ ఉత్తర్వులిచ్చింది. యూపీఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. దీనికి వచ్చే ఓటీపీ వెరిఫికేషన్ కీలక పాత్ర పోషిస్తుంది. దీర్ఘకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నంబర్లను టెలికం కంపెనీలు వేరే వినియోగదారునికి కేటాయిస్తాయి. దీంతో యూపీఐ ఖాతాలు కూడా వారి చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉండటంతో వీటిని నివారించేందుకు ఎన్‌పీసీఐ ఈ చర్యలు చేపడుతున్నది.

గాజాలో మరింత భూభాగం

ఆక్రమించండి

ఐడీఎఫ్‌కు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఆదేశం

గాజా: ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడిచిపెట్టకపోతే గాజాలోని మరింత భూభాగాన్ని ఆక్రమించాలని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ శుక్రవారం తమ దేశ సైన్యాన్ని(ఐడీఎఫ్) ఆదేశించారు. అదే సమయంలో ప్రభావిత ప్రాంతాల నుంచి పాలస్తీనియన్లను ఖాళీ చేయాలని చెప్పారు. బందీలను విడిచిపెట్టడానికి నిరాకరిస్తున్నంత కాలం హమాస్ మరిన్ని భూభాగాలు కోల్పోతూనే ఉంటుందని, అవన్నీ తమ దేశంలో విలీనమవుతాయని కట్జ్ హెచ్చరించారు. పశ్చిమాసియాలోని అమెరికా రాయబారి చొరవ తీసుకొని ఇజ్రాయెల్‌కు చెందిన చనిపోయిన, సజీవ బందీలను తమకు అప్పగించేలా కృషి చేయాలని ఆయన కోరారు. తాజా పరిస్థితులతో పాలస్తీనియన్లు ఇతర ప్రాంతాలకు పారిపోతున్నారు.

యూపీలో అత్యంత అవినీతి సర్కార్

సొంత ప్రభుత్వంపై బీజేపీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణ

ఘజియాబాద్, మార్చి 21: గతంలో ఎన్నడూ లేనంత అవినీతి ప్రభుత్వం ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో ఉందని లోనీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే నంద్ కిశోర్ గుర్జర్ శుక్రవారం సొంత ప్రభుత్వంపైనే సంచలన ఆరోపణలు గుప్పించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను అధికారులు తప్పుదారి పట్టిస్తూ రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తున్నారని ఆయన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. చిరిగిపోయిన కుర్తా ధరించి విలేకరుల సమావేశంలో పాల్గొన్న గుర్జర్ తన బట్టలను పోలీసులు చింపివేశారని ఆరోపించారు. ప్రపంచంలోనే అత్యంత అవినీతిపరుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శని, అయోధ్యలో అధికారులు లూటీ చేశారని ఆయన అన్నారు. రాష్ట్రంలో గోవధ భారీ స్థాయిలో జరుగుతోందని, బూటకపు ఎన్‌కౌంటర్లలో ప్రజలు చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ తీర్పుపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి

కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవి

న్యూఢిల్లీ: వక్షోజాలను పట్టుకోవడం, పైజమా తాడును తెంపడం వంటి చర్యలు అత్యాచారం నేరం కిందకు రావని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన రూలింగ్‌పై కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పును తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలన్నారు. నాగరిక సమాజంలో ఇటువంటి తీర్పునకు చోటు లేదన్నారు. దీని ప్రభావం సమాజం మీద ప్రతికూలంగా పడుతుందన్నారు. దీనిపై మరింత ఎక్కువగా చర్చిస్తామని తెలిపారు. యూపీలోని కస్‌గంజ్‌లో 2021లో ఓ బాలిక తల్లితో కలిసి వెళ్తుండగా ఇద్దరు బాలికను ఓ వంతెన కిందకు లాక్కెళ్లారు. ఆమె అరవడంతో స్థానికులు ఆమెను కాపాడారు. ఈ కేసులో హైకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

దక్షిణాదికి అన్యాయమే

మొదటిపేజీ తరువాయి...

వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. డీలిమిటేషన్ వల్ల కొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెరగడం, మరికొన్ని రాష్ట్రాలకు తగ్గిపోవడం ప్రాంతీయ అసమతుల్యతను పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ కోసం ప్రయత్నించిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం శిక్ష విధించినట్టుగా ఈ చర్య ఉంటున్నదని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సమగ్రంగా చర్చించేందుకు తమిళనాడులోని అధికార పక్షం డీఎంకే శనివారం దక్షిణాది రాష్ట్రాల అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం శుక్రవారం సాయంత్రం చెన్నై చేరుకున్నది. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'జనాభా నియంత్రణను పాటించిన రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, డీలిమిటేషన్ విధానం వారిని శిక్షించేలా ఉన్నది' అని మండిపడ్డారు. డీలిమిటేషన్ వల్ల కేవలం రాజకీయ ప్రాతినిధ్యం మాత్రమే తగ్గదని, కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా గణనీయంగా తగ్గిపోతాయని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా బలమైనవిగా ఉండటమే కాకుండా, దేశం మొత్తానికి పెద్దమొత్తంలో ఆదాయం సమకూరుస్తున్నాయని చెప్పారు.



చెన్నైలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

ఇప్పుడు మౌనంగా ఉంటే చరిత్ర మనల్ని క్షమించదు: కేటీఆర్

డీలిమిటేషన్‌పై ఇప్పుడే గట్టిగా స్పందించాలని, లేకపోతే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించబోవని కేటీఆర్ హెచ్చరించారు. ఈ సమయంలో అన్ని దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని, ఒకే గళంతో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాల్సిన సమయం ఇదేనని పిలుపునిచ్చారు. 'దక్షిణాది రాష్ట్రాల ప్రగతికి ఈ ప్రతిపాదన పెద్ద అడ్డంకిగా మారనున్నది. ఇది కేవలం రాజకీయ సమస్య మాత్రమే కాదు. భవిష్యత్‌లో ఆర్థిక అసమతుల్యతను కూడా పెంచేలా ఉన్నది. ఇప్పుడు మౌనంగా ఉండటం నేరం. ఇది కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు. ఇది మొత్తం దక్షిణాదికి సంబంధించిన అంశం. అందరం కలసి పోరాడితేనే మన హక్కులను కాపాడుకోగలం. ఒకసారి ప్రాతినిధ్యం తగ్గిపోతే మళ్లీ దాన్ని తిరిగి తెచ్చుకోవడం అసాధ్యం. అందుకే ఇప్పుడే పోరాడక తప్పదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

చెన్నై సమావేశం.. కీలక చర్చలు

చెన్నైలో శనివారం జరిగే దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో డీలిమిటేషన్ ప్రభావంపై సుదీర్ఘ చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విధానాన్ని ఎండగట్టి, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశంలో కేటీఆర్ ప్రత్యేకంగా ప్రసంగించి డీలిమిటేషన్ వల్ల కలిగే నష్టాలను వివరించనున్నారు. చెన్నై సమావేశం ద్వారా ఒక నిర్ణయం తీసుకుని, భవిష్యత్తులో ఒక కూటమిగా నిలిచి ఈ అన్యాయాన్ని సమిష్టిగా ఎదుర్కోనున్నాయి. ఈ సమావేశం ద్వారా దక్షిణాది రాష్ట్రాల ఐక్యత మరింత బలపడుతుందని, భవిష్యత్ రాజకీయాల్లో ఇది ఒక కీలకమైన మలుపు కావొచ్చని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. చెన్నై సమావేశం ద్వారా ఈ అంశంపై మరింత స్పష్టత రానుందని, దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి కేంద్రాన్ని ఒత్తిడికి గురి చేస్తాయని బీఆర్ఎస్ పార్టీ విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నేతలు కేటీఆర్‌తోపాటు రాజ్యసభలో పార్టీ పక్ష నేత కేఆర్ సురేశ్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు హాజరు కానున్నారు.

పునర్విభజన.. జాతీయ ఉద్యమం: స్టాలిన్

కేంద్రం చేపట్టనున్న డీలిమిటేషన్ సమాఖ్యవాదం పునాదిపై దాడి అని, అది ప్రజాస్వామ్యాన్ని తుడిచిపెట్టేస్తుందని, మన హక్కుల విషయంలో రాజీపడేలా దిగజారుస్తుందని తమిళనాడు ముఖ్యమంతి ఎంకే స్టాలిన్ అన్నారు. డీలిమిటేషన్‌పై కొన్ని ప్రధాన రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విపక్ష, ఇతర ముఖ్య నేతలతో ఆయన శనివారం చెన్నైలో సమావేశం కానున్నారు. తొలి జేఏసీ సమావేశం సందర్భంగా ఆయన శుక్రవారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. న్యాయమైన పునర్విభజన పొందడం మన హక్కని అన్నారు. 2026లో కేంద్రం పునర్విభజన చేపడుతుందని, ప్రస్తుత జనాభా ఆధారంగా దానిని చేపడితే పార్లమెంట్‌లో మన ప్రాతినిధ్యంపై గణనీయమైన ప్రభావం పడుతుందని, మన గళాలు మూగబోతాయని అన్నారు. 22న జరిగే జేఏసీ సమావేశానికి కేరళ సీఎం పినరయి విజయన్ చెన్నైకు చేరుకున్నారు. అలాగే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సమావేశానికి విచ్చేస్తారని భావిస్తున్నారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనకు వ్యతిరేకంగా అనేక రాష్ట్రాలు చేతులు కలపడంతో ఇప్పుడు ఇది జాతీయ ఉద్యమంగా మారిందని స్టాలిన్ అన్నారు.

ఎదురులేని ఎఫ్-47!

ప్రపంచంలో మరేది సాటిరాదు: ట్రంప్

వాషింగ్టన్, మార్చి 21: ప్రపంచంలోనే తొలిసారిగా ఆరో తరం ఫైటర్ జెట్ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం వెల్లడించారు. దీనిని ఎఫ్-47గా పిలవనున్నట్టు, బోయింగ్ సంస్థ దీనిని నిర్మించనున్నట్టు చెప్పారు. ప్రపంచంలోని మరే జెట్ విమానం దీని దరిదాపుల్లోకి కూడా రాదని అన్నారు. వేగం నుంచి యుక్తి వరకు, పేలోడ్ నుంచి సామర్థ్యం వరకు దీనికి సాటిలేదని ప్రశంసించారు. ఎఫ్-47 అన్నది అందమైన నంబరని అన్నారు. ఇప్పటివరకు ఐదో తరం జెట్‌గా ఉన్న ఎఫ్-22 రాప్టర్ స్థానాన్ని భవిష్యత్‌లో ఇది భర్తీ చేస్తుందని చెప్పారు.

హీత్రూ విమానాశ్రయం మూసివేత

2.90 లక్షల మంది ప్రయాణికులకు ఇబ్బందులు

లండన్: లండన్‌లోని హీత్రూ విమానాశ్రయం సమీపంలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ఈ అంతర్జాతీయ ట్రావెల్ హబ్ నుంచి రాకపోకలు సాగించే 2.90 లక్షల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 1,350 విమానాలను రద్దు చేశారు. ఇదిలావుండగా, ఈ విమానాశ్రయం అధికారులు ఇచ్చిన ఎక్స్ పోస్ట్‌లో, శుక్రవారం పాక్షికంగా విమానయాన సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో కార్యకలాపాలు శనివారం నుంచి పునఃప్రారంభమవుతాయని ప్రకటించారు.

దొంగలతో లండన్ హడల్

లండన్: ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక నగరంగా పేరొందిన లండన్‌లో ఇటీవల రికార్డ్ స్థాయిలో మొబైల్ ఫోన్ దొంగతనాలు జరుగుతున్నాయి. నగరంలో చాలా మంది ఫోన్ దొంగల బాధితులే. పోలీస్ రికార్డుల ప్రకారం ఈ ఫిబ్రవరిలో 70,095 ఫోన్లు చోరీకి గురయ్యాయి. చైనా విద్యుత్తు బైక్‌లపై ఫోన్ దొంగలు వీధుల్లోకి దూసుకొచ్చి ప్రజల చేతుల్లోని ఫోన్లను లాక్కొని పరారవుతున్నారు. దీంతో చోరీ నిరోధక ఫీచర్లను ఫోన్లలో అమర్చాలని బ్రిటన్ సర్కారు సాంకేతిక కంపెనీలను కోరింది.

కర్ణాటకలో హనీ ట్రాప్ మంటలు

- సూత్రధారి కాంగ్రెస్ ముఖ్యనేత?
- అధికారం కోసమే చేయిస్తున్నారా?
- మంత్రికి సంబంధం ఉంటే బర్తరఫ్ చేయాలని బీజేపీ డిమాండ్
- అసెంబ్లీని కుదిపేసిన వ్యవహారం

అసెంబ్లీలో నినాదాలుచేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేను మోసుకొని వెళుతున్న మార్షల్స్

బెంగళూరు: కర్ణాటకలో సంచలనం సృష్టిస్తున్న హనీ ట్రాపింగ్ కుంభకోణం కాంగ్రెస్ ప్రభుత్వం మెడకు చుట్టుకోనున్నది. తనపై కూడా హనీ ట్రాప్ ప్రయత్నం జరిగిందంటూ స్వయంగా రాష్ట్ర మంత్రి అసెంబ్లీలో ప్రకటించినప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల పాత్రపై ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. దీని వెనుక ఎవరైనా మంత్రి ఉంటే వెంటనే ఆ వ్యక్తిని బర్తరఫ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. అంతేగాక అధికారం కోసం ఎవరైనా ఈ కుట్రకు పాల్పడితే శాసనసభే నైతికతను కోల్పోతుందని బీజేపీ ఆందోళన వ్యక్తం చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య గత కొంతకాలంగా ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది. అధిష్ఠానానిదే తుది నిర్ణయమని రెండు వర్గాలు చెబుతున్నప్పటికీ లోలోపల ఎవరికి వారే అధికార పీఠం కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. తాజాగా హనీ ట్రాప్ కుంభకోణం వెలుగుచూడడం, అందునా స్వయంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ మంత్రే దీనిపై ఆందోళన వ్యక్తం చేయడం పలు సందేహాలకు దారితీస్తోంది. శుక్రవారం దీనిపై వాడీవేడిగా అసెంబ్లీలో చర్చ జరిగింది. కేంద్రంలోని నాయకులతోసహా 48 మంది రాజకీయ నేతలపై హనీ ట్రాప్ జరిగినట్టు సహకార మంత్రి కేఎన్ రాజన్న గురువారం అసెంబ్లీలో ప్రకటించగా ఫిర్యాదు చేస్తే దర్యాప్తునకు ఆదేశిస్తానని హోం మంత్రి జీ పరమేశ్వర హామీ ఇచ్చారు. శుక్రవారం సభ ప్రారంభం కాగానే కాగానే ప్రతిపక్ష బీజేపీ సభ్యులు దీనిపై న్యాయ విచారణ కోసం డిమాండ్ చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గ్యారెంటీడ్..గ్యారెంటీడ్.. హనీట్రాప్ గ్యారెంటీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హనీ ట్రాప్ ఆరోపణలపై సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలో సమాధానం ఇవ్వాలని వారు పట్టుపట్టారు.

18 మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్

హనీ ట్రాప్ కుంభకోణంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపిస్తామని సిద్ధరామయ్య హామీ ఇచ్చినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు శాంతించలేదు. పోస్టర్లు, సీడీలు చూపిస్తూ హనీ ట్రాప్ గ్యారెంటీతో మంత్రులు, ఎమ్మెల్యేలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తూ వారు సభలో పెద్దపెట్టున నినాదాలు చేశారు. సభ అదుపులోకి రాకపోవడంతో 18 మంది బీజేపీ సభ్యులను ఆరు నెలలపాటు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ఖాదర్ ప్రకటించారు.

కర్ణాటక ఎమ్మెల్యేల వేతనాలు రెట్టింపు

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ప్రజాప్రతినిధుల జీతాలు రెట్టింపయ్యాయి. గ్యారెంటీలను అమలుచేయని కాంగ్రెస్ సర్కారు.. ఎమ్మెల్యేలు, మంత్రుల వేతనాలను మాత్రం భారీగా పెంచింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు శుక్రవారం శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ పెంపుతో సీఎం సిద్ధరామయ్య జీతం 75 వేల నుంచి 1.50 లక్షల రూపాయలకు పెరుగుతుంది. అలాగే మంత్రులందరికీ 108 శాతం పెంపుతో ప్రస్తుతమున్న 60 వేల నుంచి 1.25 లక్షలవుతుంది. ఇక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతం 40 వేల నుంచి 80 వేలు, వారి పెన్షన్ 50 వేల నుంచి 75 వేలు, అసెంబ్లీ స్పీకర్, లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌ల జీతం 75 వేల నుంచి 1.25 లక్షల రూపాయలకు పెరుగుతుంది.

గ్రీన్ కార్డు కోసం దొంగ పెండ్లిళ్లు

శిక్ష, దేశ బహిష్కరణ తప్పదని అమెరికా హెచ్చరిక

న్యూయార్క్: 'దొంగ తాళి కట్టేయ్.. గ్రీన్ కార్డు పట్టేయ్' సంస్కృతి అగ్రరాజ్యంలో పెరిగిపోతుండటం పట్ల ఆ దేశ అధికార యంత్రాంగంలో ఆందోళన వ్యక్తం అవుతున్నది. వలస ప్రయోజనాలు పొందడానికి దొంగ పెండ్లిండ్లు చేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న అమెరికా ప్రభుత్వం అటువంటి వారికి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇది ఇమ్మిగ్రేషన్ చట్టాల ఉల్లంఘనే కాక, మొత్తం వలస విధాన వ్యవస్థ సమగ్రత, విశ్వసనీయతనే దెబ్బతీస్తుందని యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) పేర్కొంది. 'కేవలం అమెరికా పౌరసత్వం కోసమే ఇలా నకిలీ వివాహాలు చేసుకోవడం నేరం. అలాంటి వారికి దేశ బహిష్కరణ, అరెస్ట్, భారీ జరిమానాలు తప్పవు' అంటూ ఎక్స్‌లో హెచ్చరించింది.

ఆ దేశస్థులను చేసుకుంటే గ్రీన్ కార్డు

అమెరికన్ చట్టాల ప్రకారం అమెరికా పౌరులు లేదా పర్మినెంట్ రెసిడెంట్లను విదేశీయులెవరైనా వివాహం చేసుకుంటే వారికి గ్రీన్‌కార్డు లేదా న్యాయపరమైన హోదా లభిస్తుంది. అయితే ఇటీవల ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాల కోసం ఈ నిబంధనలను కొందరు తమకు అనుకూలంగా మార్చుకుని మోసాలకు దిగుతున్నారు. దీనిని కొందరు అక్రమార్జనకు సైతం వినియోగించుకుంటున్నారు. అలాంటి వారు పెద్దయెత్తున డబ్బు తీసుకుని దొంగ పెళ్లిళ్లు చేసుకుంటున్నట్టు యూఎస్‌సీఐఎస్ నిర్ధారించింది.

వరల్డ్ ఎర్త్ అవర్ నేడు

న్యూఢిల్లీ: భూ మండలాన్ని భావి తరాల కోసం కాపాడాలనే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా ఎర్త్ అవర్‌ను ఈ నెల 22న పాటిస్తున్నారు. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఇండ్లు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు తదితర చోట్ల లైట్లు, విద్యుత్తు ఉపకరణాలను స్విచాఫ్ చేసి ఉంచుతారు. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్-ఇండియా పిలుపు మేరకు మన దేశంలో అనేక సంస్థలు, ప్రజలు భూమిని కాపాడుకోవడం కోసం ముందుకు వచ్చారు.